బీజేపీ బలోపేతానికి సైనికుడిలా పనిచేయాలి



కేశవ్ ముదిరాజ్‌ను అభినందిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కేశవ్ ముదిరాజ్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సోమవారం కేశవ్ ముదిరాజ్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్, నాయకులు రమేష్‌రాం, ఉపేందర్, శ్రీనివాస్ నాయీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రకళకు డాక్టరేట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోరా డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పంగులూరి చంద్రకళ డాక్టరేట్ పొందారు. డాక్టర్ వి. శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో 'స్టడీ ఆఫ్ ఎంహెచ్‌డీ కన్వెక్టివ్ హిట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఫ్లో ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్'అనే అంశంపై గణిత శాస్త్ర విభాగంలో పరిశోధనలు చేశారు. భవిష్యత్‌లో మరింత లోతైన అధ్యయనం చేసి తన సేవలను వివిధ రంగాలకు అందించాలనే ఆశయంతో ఉన్నానని చంద్రకళ తెలిపారు.

మంత్రివర్గ విస్తరణలో రెడ్లకు అన్యాయం

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో రెడ్డి సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణలో కనీసం ముగ్గురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారికి పదువులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో ప్రభుత్వంలో ఆరుగురు రెడ్డి మంత్రులు ఉండేవారని ఇప్పుడు కేవలం ముగ్గురే ఉన్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు రెడ్డి సమావేశాలకు హాజరై అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని నెరవేర్చకపోవడం తగదన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ నియమించలేదని అన్నారు. సామాజిక న్యాయం పేరుతో రెడ్లను దూరంపెట్టడం శోచనీయమని అన్నారు.

విద్యాహక్కు చట్టం అమలులో విఫలం

కవాడిగూడ: విద్యాహక్కు చట్టం 2009ని పటిష్టంగా అమలు చేసి ప్రైవేట్ విద్యాసంస్థలలో 25 శాతం సీట్లను నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు కేటాయించాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) కోకన్వీనర్ సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా రిజర్వేషన్ సీట్ల అమలు జరిగేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ముషీరాబాద్ మండల డిప్యూటీ డీఈఓను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ చట్టం సరిగా అములు కాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకలజనుల పోరాటంతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యం

చిక్కడపల్లి: సకలజనుల పోరాటంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి కుసుమ ధర్మన్న కళాపీఠం, మహిళా భారతి, పాలడుగు నాగయ్య కళాపీఠం, నక్క వెంకటమ్మయాదవ్, నక్కయాదగిరియాదవ్ ఏడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవతరణ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... కవులు, కళాకారులు, జానపద గీతాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు. రాష్ట్రసాధనలో వారు కీలక భూమిక పోషించారని పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, పీవీపీ అంజనీకుమారి, పద్మావతి, సరోజినిదేవి, బడేసాబ్, రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుడికి కత్తిపోట్లు

కాచిగూడ: ఓ రైల్వే ప్రయాణికుడిపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పురా, బడాబజార్ ప్రాంతానికి చెందిన షేక్ కబీర్ (20) ఆదివారం సాయంత్రం మలక్‌పేట నుంచి యాకుత్‌పురాకు ఎంఎంటీఎస్ రైలులో వెళ్లాడు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం చివరన గుర్తుతెలియని 5 మంది వ్యక్తులు షేక్ కబీర్‌ను అడ్డుకుని డబ్బులు, సెల్ ఫోన్ ఇవ్వాలని బెదిరించారు. కబీర్ వారిని అడ్డుకోవడంతో అందులో ఉన్న ఓ వ్యక్తి కబీర్ చాతి కింది భాగంలో కత్తితో పొడిచి గాయపరిచారు. రైల్వే పోలీసులు కబీర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కబీర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం!

- నాలాల్లో పేరుకుపోతున్న పూడిక
- దుర్వాసనతో ఇబ్బందులు నాలా పరిసర బస్తీల ప్రజలు
- పెరిగిపోతున్న దోమల బెడద
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



హరాస్‌పెంటలోని హిందూ శ్మశానవాటిక నాలాలో పేరుకుపోయిన చెత్తకుప్పలను కాల్చుతున్న దృశ్యం

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని నాలాలు పూడికతీతకు నోచుకోక చెత్త, జంతు కళేబరాలు పేరుకపోయి కంపు కొడుతున్నాయి. దీంతో నాలా పరిసర ప్రాంతవాసులు తరచూ అనారోగ్యాల పాలవుతున్నారు. దీని బట్టి జీహెచ్‌ఎంసీ అధికారులకు ప్రజారోగ్యంపై ఏపాటి శ్రద్ధ ఉన్నదో ఇట్టే అర్థమవుతోంది.

అధికారుల నిర్లక్ష్యం...

◆ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం మూసీ నాలా పరిసర ప్రాంతాల ప్రజలకు శాపంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా.. నాలాల దశ మారడం లేదు. గోల్నాక డివిజన్‌లోని హిందూ శ్మశానవాటిక, కృష్ణానగర్, సుందర్‌నగర్, నెహ్రూనగర్, హరాస్‌పెంట, శాస్త్రీనగర్, సంజయ్‌గాంధీ నగర్ తదితర బస్తీల్లోని నాలాలను చూస్తే అసలు ఇది నాలానేనా..? అనే అనుమానం కలుగుతుంది. ఏళ్లు గడుస్తున్నా నాలా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

◆ నాలాలో వ్యర్థాల డంపింగ్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు పూర్తిగా మరిచారు. ఎప్పుడో ఏడాదికి ఒకసారి గట్టిదనం లేని ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న అధికారులు ఫెన్సింగ్ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. పలువురు రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను తెలిచ్చి నాలాలో డంపింగ్ చేస్తున్నారు. ఈ విధంగా నాలాలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దీనిల్ల నాలాల్లో నీరు ఒక్క ఇంచు సైతం ముందుకు కదలడం లేదు.

◆ నాలాలో నీరు పూర్తిగా నల్లగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. వర్షాకాలంలో నాలా పొంగి పొర్లుతూ ఇళ్లలోకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. నాలాకు ఎత్తయిన ప్రహరీ నిర్మిస్తే ఈ సమస్య తలెత్తదని పేర్కొంటున్నారు.

దోమల బెడద.. రోగాలబారిన ప్రజలు

◆ నాలాలలో పూడికతీతను చేపట్టకపోవడంతో పరిశుభ్రత కొరవడి దోమల పెరుగుదలకు ఆస్కారం ఏర్పడుతోంది. నాలాల్లో నెలల తరబడి పూడికతీతలు చేపట్టకపోవడంతో చెట్లు, పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అధ్వానంగా మారాయి. దీంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చేందుతున్నాయి. తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.



నాలాకు ఫెన్సింగ్ లేకపోవడంతో చెత్తను అందులోనే వేస్తున్న దృశ్యం

రిటైనింగ్ వాల్ పునరుద్ధరణ పనులు షురూ



నెహ్రూనగర్-బీ ప్రాంతంలో జరుగుతున్న రిటైనింగ్ వాల్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

సాక్షి ఎఫెక్ట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రెండు రోజుల క్రితం మూసీ నాలా పూడికతీతకు నోచుకోదా.? కూలిన రిటైనింగ్ వాల్ పేరిట ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఇటీవల కురిసిన అకాల వర్షానికి నెహ్రూనగర్-బీ కాలనీ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ కూలింది. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ కె.రవిచారి ప్రస్తావించారు. మేయర్ హామీ మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులు రిటైనింగ్ వాల్ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కె.రవిచారి పనులను పరిశీలించి మాట్లాడారు. 180 మీటర్ల మేరకు పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉండగా కేవలం 50 మీటర్ల మేరకే పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్ణంగా పనులు చేపడితే రానున్న వర్షాకాలంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపూర్ణంగా పనులు చేయాలని డిమాండ్ చేశారు.

బాధితులకు తక్షణమే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



ఇళ్లు కేటాయించాని మంత్రి పొన్నం, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బస్తీవాసులు, కార్పొరేటర్ పావనితో వెళ్లి ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి బస్తీవాసుల సమస్యలను వివరించారు. మంత్రి, కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం డా. లక్ష్మణ్ మాట్లాడుతూ... ఇళ్లు కోల్పోయి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత వినయ్‌కుమార్, బస్తీవాసులు ఎంబీ కృష్ణ, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, ఇందు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ సమావేశం సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, వి.ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిజాబాబాద్‌లో ఈనెల 21, 22వ తేదీలలో జరిగే తెలంగాణ రాష్ట్ర టీయూసీఐ ప్రథమ మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు హన్మేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ లింగంగౌడ్, ఎస్.శ్రీనివాస్, అఫ్జల్, కేఎస్ ప్రదీప్, టి.నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, మెహర్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్

ముషీరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాసంస్థలను బలోపేతం చేసి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టేలా ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ శ్రీకాంత్, నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం 3వేల పై చిలుకు పాఠశాలల మూసివేతకు పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. మరోపక్క ఇంజినీరింగ్ కళాశాలలు వేలాది రూపాయలను డొనేషన్ల రూపంలో వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యాహక్కు చట్టం అమలులో విఫలం..

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ చట్టం ప్రకారం 25 శాతం ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని ఉన్నా ఏ ఒక్క పాఠశాలలో అమలు కావడం లేదన్నారు. చదువును వ్యాపారంగా చూస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయకుండా విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యా శాఖకు తక్షణమే మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న విద్యాశాఖ అధికారుల పోస్టులను భర్తీ చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి.మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, జె.రాజేశ్వర్, మంద నవీన్, సంతోష్, సహాయ కార్యదర్శులు గౌతంకుమార్, జి.మస్తాన్, డి.ప్రణయ్, గుర్రం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో ఫోన్లు దొంగలిస్తున్న యువకుడి అరెస్ట్

కాచిగూడ: జల్సాలకు అలవాటు పడి రైళ్లల్లో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌లోని కామేశ్వరరావు కాలనీకి చెందిన మహ్మద్ ఇబ్రహీం కుమారుడు మహ్మద్ అహ్మద్ మోహినుద్దీన్ అలియాస్ దావూద్ (27) వృత్తిరీత్యా సోఫా రిపేర్ చేస్తుంటాడు. కొంత కాలంగా రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్లను ఎంచుకొని సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దొంగిలించిన ఫోన్లను తక్కువ ధరకు విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం నిందితుడు రైళ్లలో సెల్‌ఫోన్లను దొంగలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి మోహినుద్దీన్‌ను ఆరా తీశారు. అతడి నుంచి రెండు ఖరీదైన సెల్‌ఫోన్లను స్వాధీనం పరుచుకున్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం



నల్లకుంట: ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం నల్లకుంట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడు(82) విద్యానగర్ ఏఎంఎస్ ఆస్పత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న నల్లకుంట పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతడిని పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. శవ పంచనామ నిర్వహించి మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పేరు రవి అని అతడు కొంత కాలంగా ఇక్కడ వీధుల్లో భిక్షాటన చేస్తున్నాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈ ఫొటోలోని మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే నల్లకుంట పోలీసులను సంప్రదించాలని కోరారు.

యువతి అదృశ్యం



సుమయ్యా హుస్నా (ఫైల్)

కాచిగూడ: స్నేహితుడి పుట్టిన రోజుకని ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌కు చెందిన ఆర్షియా బేగం, సయ్యద్ ఖాదర్ దంపతుల కూతురు సుమయ్యా హుస్నా (17). ఆదివారం రాత్రి స్నేహితురాలు షమీన్‌తో కలిసి శివం రోడ్డులోని ఖాజా మొయినుద్దీన్ పుట్టిన రోజు వేడుకకు వెళ్లింది. కాచిగూడలోని ఖురేషి మసీదు వద్దకు చేరకున్న సమయంలో సుమయా హుస్నా తప్పిపోయిందని తెలిపారు. ఇప్పటి వరకు ఇంటికి చేరుకోకపోవడంతో తల్లి ఆర్షియాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖాజా మొయినుద్దీన్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుక్స్, యూనిఫాం దందాను అరికట్టాలి



ఎస్వీకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో బుక్స్, యూనిఫాం దందాను అరికట్టాలని హైదరాబాద్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కె. అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు దోపిడీకి గురి చేస్తున్నాయని అన్నారు. ఫీజులతో పాటు బుక్స్, యూనిఫాం తదితర వస్తువుల పేరిట అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇలా అధికంగా దీనిపై నిఘా పెట్టాల్సిన జిల్లా యంత్రాంగం వారిచ్చే మాముళ్లకు ఆశపడి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల తల్లిదండ్రులు నిలువు దోపిడీకి గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు జీఓ నం.1ని సమర్థవంతంగా అమలు చేసి ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్, నాగేందర్, శ్రీమన్, స్టాలిన్, సహన, సాయి తదితరులు పాల్గొన్నారు.

'మాకు 3 నెలల గడువు ఇప్పించండి'

వీహెచ్‌ను కోరిన చిక్కడపల్లి మార్కెట్ దుకాణాల యజమానులు

చిక్కడపల్లి: ఇటీవల మున్సిపల్ మార్కెట్‌ను కూలిచ్చవేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమైన విషయం తెలిసిందే. అధికారులను కొంత సమయం కోరిన మార్కెట్‌లోని దుకాణాల యజమానులు సోమవారం మాజీ ఎంపీ వీహెచ్‌ను కలిశారు. తమకు మూడు నెలల గడువు ఇప్పించాలని ఆయనను కోరారు. ప్రస్తుతం ఉన్న విధంగానే అంతే స్థలంలోనే తమకు దుకాణాలు తిరిగి కేటాయించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడాలన్నారు. వెంటనే ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. దుకాణదారులకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు.

'శిక్షణ తరగతులు ఆత్మవిశ్వాసం పెంచుతాయి'



ఏఐ టూల్స్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ. సురేందర్‌రెడ్డి, డా. అచ్యుతాదేవి

కాచిగూడ: శిక్షణ తరగతులు అధ్యాపకుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి అన్నారు. నారాయణగూడలోని కళాశాలలో సోమవారం ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ ఆధారిత ఫ్యాకల్టీ అభివృద్ధి శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... విద్యార్థులకు నూతన భావజాలాన్ని అందించాలంటే అధ్యాపకులు మొదటగా సాంప్రదాయ జ్ఞానాన్ని విశ్లేషించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శిక్షణ కార్యాక్రమాలు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత, వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ అభివృద్ధిపై డాక్టర్ సి.కవిత ఎడిటర్‌గా రూపొందించిన 'సోషల్ ఇన్నోవేషన్, మీటింగ్ నీడ్స్ సాల్వింగ్ చాలెంజెస్'ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.సురేందర్‌రెడ్డి, రంజిత్ తుంగ, డాక్టర్ సి.కవిత, వివిధ కళాశాలల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి



ధర్మకర్తలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆలయ ఈఓ జ్యోతి

ముషీరాబాద్: దేవాలయాల అభివృద్ధికి ధర్మకర్తలు అంకితభావంతో పని చేయాలని ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. భోలక్‌పూర్‌లోని దేవునితోటలోని భవానీశంకర ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తల ప్రమాణస్వీకారం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఈఓ జ్యోతి హాజరై వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... దేవాలయానికి వచ్చే భక్తులకు మంచి దర్శనభాగ్యం కలిగించేలా ఆలయ కమిటీ, ధర్మకర్తలు చూడాలన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, నాయకులు పెండం శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్, జఫీర్‌ఉద్దీన్, జీఎస్ కేశవ్, డి.వెంకటేష్, వీడీ కృష్ణ, అంజియాదవ్, లోకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ధర్మకర్తలు...

భవానీశంకర ఆలయ నూతన కమిటీ ధర్మకర్తలు 16 మందిని నియమించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మేడి సురేష్‌కుమార్, ధర్మకర్తలుగా ఎం.శ్వేత, పి.నర్సింగ్‌రావు, సాయిబాబా, నీల్‌చందర్, సూర్య చంద్రశేఖర్, క్రాంతి, కె.పరమేష్, లక్ష్మణ్, వై.పి. రాజు, మహేష్‌కుమార్, రాజు, తలారి నర్సింగ్ రావు, సురేందర్, కిసోర్‌యాదవ్, రంజిత్‌గౌడ్‌ను నియమించారు. వీరి పదవికాలం సంవత్సర కాలం పాటు ఉంటుందని ఈఓ జ్యోతి తెలిపారు.

వాటర్‌వర్క్స్‌లో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి



కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మట్లాడుతున్న సతీష్‌కుమార్, కె.రాజిరెడ్డిలు, నేతలు

చిక్కడపల్లి: వాటర్‌వర్క్స్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐక్య యూనియన్ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో జేసీఎల్ సునీత గోపాల్‌దాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్ కుమార్, వాటర్‌వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి మాట్లాడుతూ... తక్షణమే వాటర్‌వర్క్స్‌లో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. గతేడాది మేలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామన్న అధికారులు ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. ఉద్యోగుల తరపున ప్రాతినిధ్యం లేకపోవడంతో యాజమాన్యానికి తమ డిమాండ్లను వివరించలేకపోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నేతలు ఎండీ జహంగీర్, శ్రావణ్‌కుమార్, రాఘవేంద్రరాజ్, చంద్రశేఖర్, దేవేందర్, లక్ష్మణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్య

కవాడిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మకమైన విద్య లభిస్తుందని.. సర్కారు బడులు క్రమశిక్షణ, దేశభక్తికి నిలయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సోమవారం ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో డివిజన్‌లోని బీమా మైదాన్ వాంబేకాలనీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బడీడు పిల్లలను పనులకు పంపించకుండా వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కష్టపడి చదివిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం అవుతుందని తెలిపారు. సరస్వతిని నమ్ముకున్న వారు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని పేర్కొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి..

బడిబాటను విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మోజు పెంచుకోకుండా ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నగర నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, కరికె కిరణ్, శంకర్, హైస్కూల్ హెచ్‌ఎం మీనాకుమారి, ప్రైమరీ హెచ్‌ఎం పావన, ఉపాధ్యాయులు నాగయ్య, వెంశీ, మమత, వసంత, వీణ, శీరిష, అనిల్‌కుమార్, హేమతో పాటు పిల్లలు తల్లిదండ్రులు బడిబాట ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

